సోమవారం 23 సెప్టెంబరు, 2024

5

శ్రీకాకుళం

నేడు సామూహిక రాయబారం : ఎస్‌ఎఫ్‌ఐ

శ్రీకాకుళం: విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ వద్ద సామూహిక రాయబారం కార్యక్రమాన్ని సోమవారం చేపడుతున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని, జిఒ నంబరు 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు రూ.3,480 కోట్లను విడుదల చేయాలని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ మెస్ ఛార్జీలను రూ.మూడు వేలకు పెంచాలని, బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.

- మూడు నెలలుగా నిలిచిన గ్రానైట్, పాలిషింగ్ పర్మిట్లు
- నేటికీ మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- ఉపాధి కోల్పోతున్న కార్మికులు
- నెలకు రూ.24 కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికీ గండి

గ్రానైట్ సం'క్షోభ'ం

ఒకప్పుడు నీలాల గ్రానైట్‌తో కళకళలాడిన గ్రానైట్ పరిశ్రమలు నేడు కళావిహీనంగా మారాయి. గ్రానైట్ కటింగ్ రాళ్ల ఎగుమతులకు ప్రభుత్వం పర్మిట్లు ఇవ్వకపోవడంతో సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ పరిశ్రమలే ఆధారంగా ఉన్న పాలిషింగ్ యూనిట్లు, లారీ ట్రాన్స్‌పోర్టుల పరిస్థితి దయనీయంగా ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్మిట్లను నిలిపివేయడం, మూడు నెలలుగా అనుమతులు ఇవ్వకపోవడంతో టెక్కలిలోని సుమారు వంద పరిశ్రమలు మూసివేత దిశగా ఉన్నాయి. మరోవైపు పర్మిట్లు ఇవ్వకపోవడంతో ప్రభుత్వానికి పన్నుల రూపంలో ప్రతి నెలా వచ్చే సుమారు రూ.24 కోట్ల మేర ఆదాయానికీ గండి పడుతోంది.

ప్రజాశక్తి - టెక్కలి

జిల్లాలో గ్రానైట్ క్వారీల నుంచి ఉత్పత్తి ఆయ్యే బ్లాక్‌లకు పర్మిట్లను భూగర్భ, గనుల శాఖ మంజూరు చేసేది. గత ప్రభుత్వ హయాంలో దీన్ని ఆ శాఖ నుంచి తప్పించి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. ఇందులో భాగంగా టెక్కలిలో విశ్వసముద్ర ఏజెన్సీకి కట్టబెట్టారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసే వరకు ఆ ఏజెన్సీనే పర్మిట్లు మంజూరు చేసేది. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పర్మిట్ల మంజూరు అధికారాన్ని ఏజెన్సీలకు రద్దు చేసింది. గతంలో వలే భూగర్భ గనుల శాఖకు ఆ అధికారాన్ని ఇవ్వలేదు. జిల్లాలో గ్రానైట్ క్వారీలు, పాలిషింగ్ యూనిట్లు కలిపి సుమారు వంద వరకు ఉంటాయి. వీటిలో ఎక్కువ పరిశ్రమలు, పాలిషింగ్ యూనిట్లు టెక్కలి నియోజకవర్గంలోనే ఉన్నాయి. మూడు నెలలుగా ప్రభుత్వం పర్మిట్లు ఇవ్వకపోవడంతో గ్రానైట్ పరిశ్రమలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఈ పరిశ్రమల్లో పనిచేస్తున్న వందలాది కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. దీంతో కొందరు ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

ఆదాయాన్ని కోల్పోతున్న పరిశ్రమలు, ప్రభుత్వం

గ్రానైట్ బ్లాక్‌లకు పర్మిట్లు మంజూరు చేయకపోవడంతో ఇటు పరిశ్రమలు, అటు ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోతున్నాయి. గ్రానైట్ పరిశ్రమతో ముడిపడి ఉన్న వ్యాపార లావాదేవీలన్నీ స్తంభించాయి. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కూడా కోల్పోతోంది. గ్రానైట్ బ్లాక్‌లకు పర్మిట్లు మంజురు చేయడం వల్ల నెలకు సుమారు రూ.13 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వస్తుంది. అదేవిధంగా పాలిషింగ్ యూనిట్ల ద్వారా మరో రూ.పది కోట్ల వరకు ఆదాయం ఉంటుంది. లారీ ట్రాన్స్‌పోర్టుల ద్వారా మరో రూ.కోటి వరకు ఆదాయం ఉంటుంది. పర్మిట్లు లేక ఎగుమతులు నిలిచిపోవడంతో ప్రస్తుతం అవన్నీ స్తంభించాయి. జిల్లాలో గ్రానైట్ బ్లాక్‌లకు, పాలిషింగ్ యూనిట్లకు పర్మిట్లు మంజూరు చేయాలని కోరుతూ ఇరు పరిశ్రమల యజమానులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత శాఖ మంత్రి, కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించి పర్మిట్లు మంజూరు చేయాలని చెప్పినా, నేటికీ ఫలితం లేదు. రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి, చిత్తూరు, గుంటూరు జిల్లాల్లోనే ఈ సమస్య ఉంది. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి పర్మిట్ల మంజూరుపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని పరిశ్రమల యజమానులు కోరుతున్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి సభ్యులు

'చెకుముకి'తో శాస్త్రీయ దృక్పథం పెంపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఏటా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి దోహదపడుతుందని ఆలిండియా పీపుల్స్ సైన్స్ కాంగ్రెస్ సభ్యులు జి.మురళీధర్ అన్నారు. నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో చెకుముకి సైన్సు సంబరాల సన్నాహక సమావేశం జెవివి జిల్లా అధ్యక్షులు కె.కామేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించి శాస్త్రీయ విజ్ఞానంపై విద్యార్థుల్లో మరింత ఆసక్తిని పెంపొందిస్తున్నట్లు తెలిపారు. శాస్త్రీయ దక్పథాన్ని పెంచడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో తెలుగువారి సత్తా చాటుకునేందుకు వీలవుతుందన్నారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ ఈనెల 25న పాఠశాల స్థాయిలో నిర్వహించనున్న చెకుముకి సైన్సు సంబరాల్లో జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లోని 25 వేల మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లా విద్యాశాఖ సహకారంతో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు. అనంతరం సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఎపి ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రాష్ట్ర నాయకులు ఎస్.సాయి శ్రీనివాస్, రామకృష్ణ, ఎపి జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు, ఎపి సోషల్ స్టడీస్ ఉపాధ్యాయ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు, చెకుముకి జిల్లా కన్వీనర్ పి.కూర్మారావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు బి.మోహనరావు, జిల్లా కోశాధికారి వి.ఎస్ కుమార్, జిల్లా కార్యదర్శి ఆర్.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థలను గాడిలో పెట్టాం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని 30 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లి వెంటిలేటర్‌పై వదిలేసిన వ్యవస్థలను వంద రోజుల్లో గాడిలో పెట్టామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలం కొత్తపల్లిలో ఆదివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్దిరోజుల్లోనే విపత్తులు వచ్చాయన్నారు. 20 రోజుల పాటు అతలాకుతలమైన విజయవాడను యధాస్థితికి తెచ్చామన్నారు. రాష్ట్ర ప్రజలు 22 కూటమి ఎంపీలను గెలిపించడంతో కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. కేంద్ర సహకారంతో రాష్ట్రానికి కొంత ఊరట లభిస్తోందని తెలిపారు. ధాన్యం కొనుగోలు బిల్లులు రూ.1600 కోట్లు పెండింగ్‌లో ఉండగా, ఇటీవల వాటిని విడుదల చేశామన్నారు. ఇకపై ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే బిల్లులు చెల్లిస్తామన్నారు. సంక్రాంతి లోపు రైతులకు పెట్టుబడి సొమ్ము జమ చేస్తామని చెప్పారు. డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీలకు రుణాలు అందజేస్తామని, గత తెలుగుదేశం పాలనలో అమలు చేసిన అన్ని పథకాలను తిరిగి అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సుదర్శన దొర, మండల ప్రత్యేకాధికారి గడ్డెమ్మ, తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, టిడిపి నాయకులు శిమ్మ సింహాచలం, కోరాడ సుబ్రమణ్యం, మాజీ ఎంపిపిలు వెలమల విజయలక్ష్మి, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కొత్తమ్మతల్లి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

అక్టోబర్ 1 నుంచి మూడో తేదీ వరకు నిర్వహించే కొత్తమ్మతల్లి ఉత్సవాల పోస్టర్‌ను మంత్రి అచ్చెన్నాయుడు నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వ పండగగా గుర్తించడంతో అంగరంగవైభవంగా చేయించాలని, అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆలయ ఇఒ వి.రాధాకృష్ణకు సూచించారు. ఉత్సవాలకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు.

స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌కు సలహాల స్వీకరణ

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రూపొందిస్తున్న స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంట్‌లో జిల్లాస్థాయి ప్రణాళిక ప్రస్ఫుటంగా ఉండేలా ప్రజలు, ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలను స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. వికసిత్ భారత్ నేపథ్యంలో రాష్ట్రంలో స్వర్ణాంధ్ర 2047 లక్ష్యసాధన కోసం మండల, జిల్లాస్థాయిలో అభిప్రాయ సేకరణ అనంతరం ఆయా ప్రణాళికలను క్రోడీకరించి జిల్లాస్థాయి ప్రణాళికను అక్టోబరు 15 లోగా ప్రభుత్వానికి అందజేయనున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రానున్న ఐదేళ్ల కాలానికి ఒక విజన్‌తో కూడిన నివేదికను రూపొందించాల్సి ఉందని తెలిపారు. జిల్లాలోని ప్రతి శాఖ ఈ లక్ష్యసాధనలో నిర్ణయాత్మక పాత్ర పోషించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. డాక్యుమెంటేషన్ రూపకల్పనలో భాగంగా ఈనెల 21 నుంచి అక్టోబరు ఐదో తేదీ వరకు నిర్వర్తించాల్సిన కార్యాచరణను వివరించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లాస్థాయి ప్రజాప్రతినిధులు, బ్యాంకర్లు, రైతులు, వాణిజ్యరంగం, ఇతర అసోషియేషన్లు తదితరులతో సమావేశాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర-2047 ప్రాముఖ్యతపై పాఠశాల, ఇంటర్మీడియట్ తదితర కళాశాలల స్థాయిలో వక్తృత్వ, క్విజ్ పోటీలు, చర్చాగోష్టులు నిర్వహించేందుకు, గ్రామ పంచాయతీ స్థాయిలో గ్రామసభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సూచనలు, సలహాలను స్వీకరించి వ్యవసాయ, ఉద్యాన, మత్స్య రంగాల్లో ప్రస్తుత విస్తరణ, దిగుబడులు, రానున్న రోజుల్లో అంతరసాగు విధానం, ఆదాయం పెంపు, ప్రకృతి సాగు విస్తీర్ణ పెంపు తదితర అంశాలు, పారిశ్రామిక, పర్యాటకరంగ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన వంటి అంశాలను ప్రణాళికలో జోడిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ కోసం 11 ప్రశ్నలతో కూడిన క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచామని, వాటి ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

క్యూఆర్ కోడ్

చీకిటి ఎమ్మెల్యేతో రైలు యూజర్స్ కమిటీ సభ్యులు

రైళ్ల హాల్ట్‌కు సహకరించాలి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో పలు రైళ్ల హాల్ట్‌కు సహకరించాలని ఒడిశా రాష్ట్రం చీకిటి ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన్ సమంతరాను రైలు యూజర్స్ కమిటీ సభ్యులు కోరారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు ఆదివారం వచ్చిన ఆయన్ను కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. సుమారు 80 గ్రామాల ప్రజలు ఈ రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారని చెప్పారు. రైళ్ల నిలుపుదల వల్ల ఇచ్ఛాపురం, చీకిటి నియోజకవర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని చెప్పారు. రత్తకన్న ఎల్‌సి గేటు వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణమైతే ఒడిశావాసులకూ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌ఆర్‌యుసిసి సభ్యులు కట్టా సూర్యప్రకాష్, కాంగ్రెస్ నాయకులు అలీంఖాన్, ఉల్లి రాజు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఎస్ఇగా మహమ్మద్ నిషాత్ హుస్సేన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీరుగా మహమ్మద్ నిషాత్ హుస్సేన్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన కార్యనిర్వాహక ఇంజినీరుగా కర్నూల్ సర్కిల్‌లో పనిచేస్తున్నారు. ఆయనకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఇక్కడ నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా 12 మంది ఇఇలకు ఉద్యోగోన్నతి లభించింది. జిల్లాలో ఎస్ఇగా పనిచేసిన మూర్తి ఉద్యోగ విరమణ చేయడంతో నాలుగు నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉంది.

వంద రోజుల వంచన

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వంద రోజుల వంచన పాలన సాగించిందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వంద రోజుల పాలనలో అభివృద్ధి ఆరడుగులు వెనక్కి వెళ్తే, అవినీతి మూడు అడుగులు ముందుకొచ్చిందని విమర్శించారు. ప్రభుత్వానికి వంద రోజులు, ప్రజలకు పంగనామాలన్నారు. ఇది మంచి ప్రభుత్వం కాదని, మాయా ప్రభుత్వమని ధ్వజమెత్తారు. తప్పుడు హామీలతో గద్దెనెక్కిన బాబు, పింఛను పెంపు మినహా మిగతా చేసిందేమీ లేదన్నారు. బుడమేరు వరద సహాయంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్‌లో ఒక్క పింఛన్ మినహా అమలు చేసిన రెండో పథకం ఏదో తెలపాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్‌లో రైతుభరోసా రూ.20 వేలు, అమ్మఒడి, ఉచిత ఇసుక, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, మెగా డిఎస్‌సి ఇలా ఏవి అమలు చేశారని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా తిరుపతి లడ్డూ కల్తీ అయిందని డైవర్షన్ రాజకీయాలు చేస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, పాలకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సమావేశంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, వైసిపి నాయకులు అన్నెపు రామారావు, నూక సత్యరాజు, సంపతిరావు హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణదాస్

హుదూద్ ఇళ్ల మరమ్మతులకు రూ.3.60 కోట్లు

ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస: పలాస నియోజకవర్గంలో గత టిడిపి హయాంలో నిర్మించిన హుదూద్ ఇళ్ల మరమ్మతులు చేపట్టేందుకు రూ.3.60 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. హుదూద్ ఇళ్ల నిర్మాణం పూర్తయినా ఇప్పటివరకు లబ్ధిదారులకు ఇవ్వకపోవడంతో పాడయ్యాయని తెలిపారు. దీంతో వాటి మరమ్మతులు చేయించేందుకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఇంగిలిగాం, వజ్రపుకొత్తూరు మండలం బెండికొండ సమీపంలో రూ.కోట్ల వ్యయంతో అప్పటి టిడిపి ప్రభుత్వం హుదూద్ ఇళ్లను నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం ఇళ్లను లబ్ధిదారులకు అందించకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఆ ఇళ్లను పేదలకు అందించాలని నాడు టిడిపి నాయకులు విన్నవించినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్లకు మరమ్మతులు చేసి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాత లబ్ధిదారులు ఇప్పటికే పలు పథకాల్లో లబ్ధి పొందితే వారిని మినహాయించి నూతన లబ్ధిదారులకు అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

అరసవల్లి లడ్డూ నాణ్యత పరిశీలన

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో యాత్రికులకు విక్రయిస్తున్న లడ్డూ నాణ్యతను ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించారు. అరసవల్లి ఆలయాన్ని ఆదివారం సందర్శించిన ఆయన ప్రసాదాల తయారీతో పాటు క్యూలైన్లలో సౌకర్యాలను పరిశీలించారు. నిత్యాన్నప్రసాద పాకశాలను పరిశీలించిన అనంతరం సత్రంలో యాత్రికులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసాదాల తయారీలో ఇంకా పాత పద్ధతులనే అనుసరిస్తున్నారని, పాకశాలను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. యాత్రికులకు నాణ్యమైన ప్రసాదాన్ని అందజేయాలని, నాణ్యతలో రాజీ పడొద్దని సూచించారు. ఇంద్రపుష్కరిణి, ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అరసవల్లి ఆలయ ఖ్యాతిని మరింత పెంచేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ డి.ఎల్.వి రమేష్‌బాబు, తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసునాయుడు, బిజెపి జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వర రావు, టిడిపి నాయకులు రెడ్డి గిరిజా శంకర్, ఆలయ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

లడ్డూను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రైవేటీకరణను విరమించుకోవాలి

మాజీ మంత్రి అప్పలరాజు

పలాస : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి వైద్య రంగాన్ని ప్రయివేటీకరణ చేసేందుకు చర్యలు తీసుకుంటుందని, ఇది సరైన పద్ధతి కాదని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని 17 నూతన ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రయివేటుపరం చేయడం దారుణమన్నారు. కేంద్రం మంజూరు చేసిన ప్రభుత్వ మెడికల్ సీట్లు నిరాకరించిందన్నారు. పిహెచ్‌సిల డాక్టర్ల ఇన్ సర్వీస్ కోట తగ్గించి తద్వారా పిహెచ్‌సిల్లో చేరికపై ఆసక్తి తగ్గించే విధంగా తీసుకున్న చర్యలు మానుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకుండా, నెట్‌వర్క్ ఆస్పత్రిని ప్రభుత్వమే బ్లాక్ మెయిల్ చేయడం, ఆరోగ్యశ్రీని సైతం నిలుపుదల చేసి, ప్రయివేటు బీమా సంస్థలకు కట్టబెట్టడం దారుణమన్నారు. ఇప్పుడు నేరుగా వైద్యులపై, వైద్య విద్యార్థులపై దాడి చేసి భయాందోళనలు సృష్టించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దకాలానికి పైగా వైద్య విద్యను అభ్యసించి, అనంతరం రాత్రి, పగలు తేడా లేకుండా అనునిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలందిస్తున్న వైద్యులపై దాడులు సరికాదన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలంతా దీనిపై ఆలోచన చేయాలని కోరారు.

చెరువుల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పూర్వీకుల కాలంలో పెద్దఎత్తున చెరువుల తవ్వకాలు చేపట్టారని, వాటిని ఏటా వర్షాకాలంలో నింపుకుంటే సాగునీటికి ఎటువంటి అడ్డంకులు ఉండవని నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ పొన్నాడ సుధాకర్ అన్నారు. వేలాది చెరువులకు పెద్దఎత్తున ఆయకట్టు ఉందన్నారు. వాటిలో నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉండడంతో 19 టిఎంసిల నీటిని నిల్వ చేసుకోవచ్చన్నారు. తద్వారా వేసవిలో నీటి ఎద్దడి నివారణతో పాటు ఖరీఫ్ సీజన్‌లో సాగుకు పూర్తిస్థాయిలో వినియోగించు కోవచ్చున్నారు. గతంలో ఈ చెరువుల మరమ్మతులకు ఏటా వేసవిలో మెంటెనెన్సు పనులు చేసుకునేందుకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేసేదని తెలిపారు. నిధులు విడుదల కాకపోవడంతో చెరువు గట్లు బలహీన పడి నీటి నిల్వకు అడ్డంకులుగా మారుతున్నాయన్నారు. ప్రభుత్వానికి పలుమార్లు నివేదించామని, ఉన్నతాధికారులు ఈసారి వేసవిలో ప్రత్యేక దృష్టిసారించి నిధులు విడుదల చేసేందుకు వీలుగా ప్రతిపాదనలు పంపిస్తున్నామని చెప్పారు. వీటితో పాటు నారాయణపురం ఆనకట్ట ఆధునికీకరణ చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లాలో సాగునీటి నిర్వహణపై ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? జిల్లాలో సాగునీటి నిల్వ సామర్థ్యం ఎలా ఉంది?

జిల్లాలో వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్ర తనయ నదులతో పాటు 6,400లకు పైగా గొలుసుకట్టు చెరువులు ఉన్నాయి. బ్రిటిష్ కాలానికి ముందే తవ్విన అతి ప్రాచీన చరిత్ర గల పెద్ద చెరువులు సైతం జిల్లాలో ఉన్నాయి. వందల ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ చెరువులకు గతంలో వర్షాధారంపైనే ఆధారపడేవారు. కానీ, వంశధార, నాగావళి నదులపై ప్రాజెక్టులు వచ్చిన తర్వాత కుడి, ఎడమ కాలువలు నిర్మించుకోవడంతో ఈ చెరువులను వాటికి అనుసంధానం చేశారు. దీంతో ప్రధాన కాలువ ద్వారా వచ్చిన సాగునీరు పెద్దఎత్తున ఈ చెరువులకు మళ్లించి నింపుకోవాలి. దీంతో ఎక్కువ కాలం నీటిని నిల్వ చేసుకునేందుకు వీలుంటుంది. జిల్లా వ్యాప్తంగా ఇలా వర్షాకాలంలో నీటి నిల్వ కోసం చెరువుల్లో ఉన్న సామర్థ్యం 19 టిఎంసిల వరకు ఉంది. ప్రవాహ సమయంలో ఈ నీటిని సక్రమంగా ముందు చెరువులకు మళ్లించుకుంటే ఆ ప్రాంత రైతాంగానికి ఖరీఫ్ సాగుకు ఎంతగానో ఉపకరిస్తోంది.

? మెంటెనెన్స్ ఎలా ఉంది?

జిల్లా వ్యాప్తంగా నీటి పారుదలశాఖ చెరువుల్లో ఉపాధి పనులు చేపట్టిన తర్వాత కొంత మేరకు నిల్వ సామర్థ్యం పెంచుకునేందుకు దోహదపడుతోంది. అయితే ఏటా మదుములు, షట్టర్లు, గట్టు బలహీన పడ్డ ప్రదేశాలను గుర్తించి వేసవిలో వాటిని మరమ్మతు చేసుకోవాల్సి ఉంటుంది. దీనికితోడు చెరువుల్లో పూడికతీత కొన్నిచోట్ల పెద్దఎత్తున జరగాల్సి ఉంది. చెరువుల్లో పూడికతీత లేక గుర్రపు డెక్క, తూటి కాడ, ఇతర రకాలైన మొక్కలు పెరిగి నిల్వ సామర్థ్యానికి ఆటంకంగా మారుతున్నాయి. కొన్నిచోట్ల గట్టు బలహీన పడి గండ్లు వేసే స్థితి ఉంది. వీటికి ఏటా మెంటెనెన్స్ పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.



? నీరు-చెట్టు కింద చేపట్టిన పనులకు ఎంతమేరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి?

జిల్లాలో నీటిపారుదలశాఖ, వంశధార ప్రాజెక్టు పరిధిలో పెద్దఎత్తున 2014-19 మధ్య కాలంలో నీరు-చెట్టు ప్రోగ్రాం కింద పనులు చేపట్టాం. ప్రతి నియోజకవర్గం పరిధిలోని ప్రధాన సాగునీటి వనరులను అభివృద్ధి చేసుకునేందుకు ఈ పథకం ఉపయోగపడింది. అయితే ఈ కాలంలో మంజూరైన పనులకు వివిధ కారణాల వల్ల బిల్లుల చెల్లింపులో కొంత మేరకు జాప్యం జరిగింది. జిల్లా వ్యాప్తంగా 2018-19 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి రూ.52.18 కోట్లు బకాయిలు చెల్లించకపోవడంతో బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. నాటి కాంట్రాక్టర్లు న్యాయస్థానాలను ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాలను మేరకు రూ.7 కోట్ల మేర చెల్లింపులు ఈ ఏడాది ఇప్పటి వరకు చేపట్టాం. మిగిలిన బిల్లులను ప్రభుత్వం చెల్లించేందుకు కసరత్తు చేస్తోంది. త్వరలో వీటినీ చెల్లించనున్నారు.

? నారాయణపురం ఆనకట్ట ఆధునికీకరణ ప్రక్రియ ఏ దశలో ఉంది?

జిల్లాలో వంశధార ప్రాజెక్టు తర్వాత అంతటి సాగు సామర్థ్యం ఉన్న ప్రాజెక్టు నారాయణపురం ఆనకట్ట. ఈ ఆనకట్టలో ఎగువ బాగాన ఇసుక మేటలు పేరుకుపోవడంతో నిల్వ సామర్థ్యం ఏటా తగ్గుతోంది. దీనికి తోడు ఆనకట్టపై అమర్చిన షట్టర్లు చాలాకాలంగా మరమ్మతుకు గురికావడంతో నీరు నిల్వకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికి మరమ్మతులు చేపట్టడంతో పాటు ఆనకట్ట ఆధునికీకరణ ప్రతిపాదన ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. ఏటా రివైజ్డ్ ప్రతిపాదనలు పంపిస్తున్నాం. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ఆధునికీకరణ సాధ్యమవుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే కుడి, ఎడమ కాలువల ద్వారా శివారు ప్రాంతాలకు సాగునీరు అందించగలం.

? పర్యవేక్షణ ఎలా సాగుతోంది?

నీటిపారుదలశాఖ గతంలో బొబ్బిలి సర్కిల్‌లో ఉండేది. ఐదేళ్ల క్రితం శ్రీకాకుళంలో ప్రత్యేకంగా సర్కిల్‌ను ప్రస్తుత వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సహకారంతో జిల్లాలో ఏర్పాటైంది. స్థాయి పెరిగిన తర్వాత పాలనా వ్యవహారాలు ఇక్కడి నుంచే కొనసాగించుకునేందుకు వీలు కలుగుతోంది. కానీ, తర్వాత పరిణామాల వల్ల పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులు లేక సర్కిల్ నిర్వహణ కొంత ఇబ్బందులు తప్పలేదు. సర్కిల్‌కు అవసరమైన నిధులతో పాటు సిబ్బంది నియామకం చేపట్టి పర్యవేక్షణ బాధ్యతలను పెంచాల్సి ఉంది.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

జి.సిగడాం : స్టిక్కర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని చెల్లాయివలసలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వంద రోజుల పాలనపై ముద్రించిన పోస్టర్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ టిడిపి కూటమి పాలనలో సిఎం చంద్రబాబు ఈ వంద రోజుల్లో పలు సంక్షేమ పథకాలతో ప్రజల చేత 'ఇది మంచి ప్రభుత్వం' అని అనిపించుకుంటుందని అన్నారు. అవ్వాతాతలకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు, లక్షలాది మంది పేదల ఆకలి తీర్చే 'అన్న క్యాంటీన్లు', యువత భవిష్యత్‌కు మెగా డిఎస్‌సి ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, వరద బాధితులను ఆదుకోవడం వంటి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మురళీకృష్ణ, నియోజకవర్గ అబ్జర్వర్ వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, బైరి భాస్కరరావు, రోణంకి కృష్ణంనాయుడు, తహశీల్దార్ సురేష్ కుమార్, ఎంపిడిఒ ఉషశ్రీ, సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని గొప్పిలి పంచాయతీల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పనితీరు, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ... పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు కోట తిరుపతిరావు, మాలతి ఢిల్లీరావు, పురుషోత్తం, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంల ముసినివలసలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించి ఇంటింటికీ స్టిక్కర్లు అంటించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు కుమరావు రవికుమార్, వజ్జపర్తి రఘురాం, బూపతి అర్జున్ కుమార్, టంకాల మౌళీశ్వరావు, జనార్ధనరావు, కుదిరెళ్ల బుజ్జి, కూనుబిల్లి కూర్మారావు, చందు, ఆరెళ్ల గొల్లాజీ, బూపతి శ్రీరామ్మూర్తి, తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపిడిఒ నిశ్చల, ఎంఇఒలు అరసాడ రవి, శ్రీనివాసరావు, ఎఇలు శ్రీవల్లి, తిరుపతిరావు, భాగ్యలక్ష్మి, ఆర్ఎస్ఐ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని కింతలి, తోలాపిలో వంద రోజుల పాలనపై మన మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ఇంటింటా ప్రచారం చేసి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసిలు కూటికుప్పల హనుమంతురావు, పప్పల కళ్యాణి, మాజీ సర్పంచ్ పి.రామారావు, గణపతిరావు, మాజీ ఎంపిటిసి అప్పల నాయుడు, జనసేన నాయకులు పొన్నాడ బాలకృష్ణ, టిడిపి నాయకులు లోకనాథం, రాజారావు పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని పాలవలస, కర్తలపాలెం, పాత్రకొండ పంచాయతీల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వంద రోజుల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, మండల పార్టీ అధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు, చెల్లూరి ధర్మారావు, భైరాగి, కృష్ణారావు, తామాడ పాపారావు, సవరయ్య, దుర్గసి మాధవరావు, బురద విశ్వనాథం, బేసి లోకనాథం, కిషోర్, జోగారావు, గణపతి, కోదండరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని గొంటివీధిలో మంచి ప్రభుత్వం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు పూడి తిరుపతిరావు, జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ దానేటి శ్రీధర్, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నరసన్నపేట : పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఎమ్మెల్యే శంకర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న చిన్నారి

నివాళ్లర్పిస్తున్న అంగన్వాడీ వర్కర్లు

పోరాటాలకు ఏచూరి దిక్సూచి

శ్రీకాకుళం అర్బన్: కార్మిక కర్షక పోరాటాలకు సీతారాం ఏచూరి మార్గదర్శి అని, ఆయన మరణం శ్రామిక వర్గానికేకాక, దేశ ప్రజలకు తీరని లోటని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముందుగా సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో అట్టడుగు వర్గాల ప్రజలకు పోషకాహారం, మెరుగైన ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, దోపిడీ లేని సమాజం కోసం నిరంతరం కృషి చేశారన్నారు. కార్మిక, రైతాంగ పోరాటాలకు అండగా నిలిచారన్నారు. ఆయన స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడడమే నిజమైన నివాళి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, వంద రోజుల పాలనలో అంగన్వాడీలకు యాప్‌ల భారం పెంచారన్నారు. తక్షణమే ఈభారాన్ని తగ్గించాలన్నారు. గడచిన ఐదేళ్లలో వేతనాలను పెంచలేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఎన్.హైమవతి, హేమ, కె.సుజాత, కె.వి.హేమలత, కె.లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి- పోలాకి

ప్రజారోగ్యమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని డోలకు చెందిన రుంకు ఉమామహేశ్వరరావు కుమార్తె కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఎమ్మెల్యే సహకారంతో సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. మేరకు సిఎం సహాయ నిధి నుంచి రూ.పది లక్షల నిధులు మంజూరయ్యారు. ఈ చెక్కును ఎమ్మెల్యే ఆదివారం ఉమామహేశ్వరరావుకు అందజేశారు. డిసిసిబి మాజీ చైర్మన్ డోల జగన్, మండల పార్టీ అధ్యక్షుడు ఎం.వెంకటఅప్పలనాయుడు, లుకలాపు రాంబాబు, బైరి భాస్కరరావు, చిట్టి సింహాచలం, సూరపు నాని, సర్పంచ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రక్తదాన శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

జూనియర్ ఎన్‌టిఆర్ అభిమానులు ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో శ్రీ రామాంజనేయ (ఎస్‌విసి) థియేటర్‌లో ఈ నెల 27న దేవర చిత్రం విడుదల సందర్భంగా థియేటర్ వద్ద ఆదివారం టీం తారక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ అభిమానం అంటే ఫ్లెక్సీలు కట్టడం, డాన్సులు వేయడమే కాదని, సమాజానికి పనికొచ్చే ఏదైనా మంచి పనులు చేయాలన్నారు. రక్తదాన శిబిరం వంటి పనులు ప్రజలకు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఎన్ఇఆర్ స్కూల్ డైరెక్టర్ ఎన్.తేజబాబు, టీమ్ తారక్ ట్రస్ట్ సభ్యులు, కూటమి నాయకులు పిసిని జగన్నాథం నాయుడు, నారాయశెట్టి శ్రీనివాసరావు, ధన తదితరులు పాల్గొన్నారు.

సత్కారం పొందుతున్న రాజారావు మాస్టారు

రాజారావు మాస్టారుకు సత్కారం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని వావిలపల్లిపేటకు చెందిన శ్రీకాకుళం జిల్లా శ్రీశ్రీ కళావేదిక ప్రధాన కార్యదర్శి వావిలపల్లి రాజారావు మాస్టార్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శ్రీమద్భగవద్గీత విశ్లేషణాత్మక గ్రంథ ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రంథంలోని తొలి అధ్యాయంపై వర్తమాన సామాజిక కోణాన్ని అన్వేశించి విశ్లేషణ జరిపినందుకు ఈయనను దుశ్శాలువ, పుష్పగుచ్చంతో సత్కరించి భగవద్గీత విశ్లేషణ ప్రతిని అందజేశారు. అలాగే మిగిలిన 17 అధ్యాయాలపై కూడా నేటి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా విశ్లేషణ జరిపిన ఇతర రచయితలకు ఇదే వేదికపై సత్కరించారు.

పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణమూర్తి

'తెప్పల'కు జీవిత సాఫల్య పురస్కారం

పలాస: హైదరాబాద్ డాక్టర్ దేవులపల్లి ఆదర్శ కళానిలయం ద్వారా అందిస్తున్న పురస్కారాల కార్యక్రమంలో పలాసకు చెందిన సీనియర్ రచయిత, నటులు, జన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి ప్రతిష్ఠాత్మకమైన జీవిత సాఫల్య పురస్కారం లభించింది. సాహితీ రంగంలోను, లయనిజంలోను మూడు దశాబ్దాలుగా విశిష్ట సేవలందిస్తున్నందుకు ఈ పురస్కారం అందజేసినట్లు తెలిపారు. షీల్డు, దుశ్శాలువా, ప్రశంసాపత్రం, పగిడిహారంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలాస-కాశీబుగ్గ లయన్స్ క్లబ్ అధ్యక్షులు హనుమంతు ఎండుదొర, జనజాగృతి అధ్యక్షులు కుమార్ నాయక్, ఉద్దానం సాహితీ వేదిక అధ్యక్షులు లండ రుద్రమూర్తికి అభినందనలు తెలియజేశారు.

మహిళా ఆర్థికాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గౌతు శిరీష

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, అన్నీ రంగాల్లో మహిళలు అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ సాయి కాలనీలో మెప్మా ఆధ్వర్యాన మార్కండేయ సమాఖ్య సాధారణ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీలకతీతంగా డ్వాక్రా మహిళలకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థల్లో రాజకీయాలు అంటగట్టి భ్రష్టు పట్టించారని విమర్శించారు. మహిళా స్వయం సహాయక ఎన్నికల్లోనూ తాము కలగజేసుకోమని, మీకు నచ్చిన వ్యక్తులకు ఎన్నుకోవాలని హితవు పలికారు. మహిళా సంఘాలు రాజకీయాలకు దూరంగా గ్రూపులు కట్టకుండా పొదుపు చేసుకుంటూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలన్నారు. మహిళలు స్వయం కృషితో పొదుపు చేసుకొని కొంత సొమ్మును కుటుంబం కోసం కేటాయించాలన్నారు. అక్కడితో ఆగకుండా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని మరింత ఆర్థికంగా బలపడాలని సూచించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బి.నాగరాజు, మెప్మా అధికారి మోహనరావు పాల్గొన్నారు.

పని సర్దుబాటు వినతులు పరిష్కరించాలి

మాట్లాడుతున్న కృష్ణారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పని సర్దుబాటు పేరుతో ఆగస్టులో చేపట్టిన చర్యల్లో లోపాలను సరిదిద్దాలని కోరుతూ ఉపాధ్యాయులు ఇస్తున్న వినతులను సత్వరమే పరిష్కరించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆగస్టు నెలలో జరిగిన ఉపాధ్యాయుల పని సర్దుబాటులో అనేక లోటుపాట్లు జరిగాయని, వీటి వలన ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఉపాధ్యాయుల నుంచి, వివిధ పాఠశాల యాజమాన్య కమిటీల నుంచి మండలాల విద్యాశాఖాధికారుల ద్వారా వచ్చిన వినతులపై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో భాషా పండితులను, స్కూల్ అసిస్టెంట్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. గతంలో ఉన్నత పాఠశాలలకు ఇచ్చిన ల్యాప్‌టాప్‌లను తిరిగి అప్పగించాలని హెచ్ఎంలపై ఒత్తిడి చేసి లాక్కోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌ల కోసం, పదవ తరగతి విద్యార్థుల పరీక్షల అప్లికేషన్స్, యు డైస్ వంటి వాటిని సజావుగా నిర్వహించేందుకు కంప్యూటర్లు, ప్రింటర్లను అందించి కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని కోరారు. సమావేశంలో వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు శిల్లా భాస్కరరావు, జి.రాజశేఖర్, సీపాన ధర్మారావు, గండెం రామారావు, గురుగుబెల్లి భాస్కరరావు, మన్యం జిల్లా ప్రధానకార్యదర్శి చింతాడ రఘు రామస్వామి, బాలకృష్ణ, సన్యాసిభట్లు, పైడి రమణ పాల్గొన్నారు.

వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ఇచ్ఛాపురం : స్థానిక ఎల్లమ్మతల్లి ఆలయం వద్ద ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాటంలో భాగంగా మున్సిపాలిటీ, మండలస్థాయి కమిటీ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షులు సల్ల దేవరాజు, కార్యదర్శులు వెంకటరావు, లోకేష్ అధ్యక్షతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు బర్రు తులసీరావు, గౌరవ సలహాదారుడిగా బాగా మోహనరావు, మండల కమిటీ కార్యవర్గంలో అధ్యక్షునిగా కొప్పల హేమంత్, ప్రధాన కార్యదర్శిగా నందూరి శ్రీను, ఉపాధ్యక్షులుగా నందూరి రవి, బడియా గణేష్, కార్యదర్శిగా దడ్డ చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి నందూరి చలపతి, తలగాన మోహనరావు, చుక్క మోహనరావును ఎన్నుకున్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ కార్యవర్గంలో అధ్యక్షునిగా గువ్వాడ దిలీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా దడ్డ గిరీష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా తునియా మాధవరావు, జుత్త ధర్మారావు, పొడ్డ కిరణ్, సహాయ కార్యదర్శిగా లండ శేఖర్, జుత్త మహేష్, మహిళా అధ్యక్షులుగా దీపాల ధనలక్ష్మి, మహిళా ప్రధాన కార్యదర్శిగా దడ్డ రుక్మిణమ్మలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణను తమ పోరాటం ద్వారా అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

పాసింజర్ రైళ్లు నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి- సోంపేట

బారువ రైల్వేస్టేషన్‌లో పాసింజర్ రైళ్ల నిలుపుదల చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైళ్ల నిలుపుదల సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొర్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రైళ్ల నిలుపుదల సాధన కమిటీ కన్వీనర్ రత్నాల శ్రీనివాసరావు అధ్యక్షతన సాధన కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి కొర్లం, పాలవలస, బారువ పరిసర గ్రామాలతో పాటు సుమారు 70 గ్రామాల ప్రతినిధులు హాజరయ్యారు. సిపిఎం నాయకులు సంగాల లక్ష్మీనారాయణ, విశ్రాంత డిఎస్‌పి ఎస్.వి.వి.ప్రసాద్, సూరాడ చంద్రమోహన్, మద్దిల నాగేశ్వరరావు, మడ్డు కుమార్, దున్న సత్యం, బి.మోహనరావు, ఉత్తరాల బ్రహ్మానందం, తడక జోగారావు, జెడ్ఆర్‌సిసి మెంబర్ కె.సూర్యప్రకాష్, సర్పంచ్ ప్రతినిధి రామ్ బుడ్డి గణపతి పాల్గొని మాట్లాడారు. బారువలో రైల్వే స్టేషన్‌లో పాసింజర్ రైళ్లు నిలుపుదల చేసినట్లయితే పరిసర గ్రామాలకు చెందిన నిరుపేద ప్రజలకు మేలు చేకూరుతుందని అన్నారు. వైద్యం కోసం నిత్యం ఈ ప్రాంతాలకు చెందిన వారంతా శ్రీకాకుళం, విశాఖపట్నం వెళ్తుంటారని, పాసెంజర్ రైలు నిలుపుదల చేస్తే వారికి ఆర్థికభారం తగ్గడమే కాకుండా వ్యయ, ప్రయాసలు మిగులుతాయి అన్నారు. అలాగే చిరు వ్యాపారాలు చేసుకునే వారంతా తమ కార్యక్రమాల కోసం రాకపోకలు సాగించేందుకు పాసింజర్ రైలు నిలుపుదల ఎంతో దోహదపడుతుందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పాలకులు స్పందించి బారువ రైల్వేస్టేషన్లో పాసింజర్ లో నిలుపుదల జరిగేటట్టు చూడాలని కోరారు. తమ డిమాండ్ల సాధనకు సాధన కమిటీ ఆధ్వర్యాన త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

మాట్లాడుతున్న సూర్యప్రకాష్, మాట్లాడుతున్న ప్రసాద్

ట్రోఫీతో ఛాయాకిరణ్

ఛాయాకిరణ్ ప్రతిభ

పలాస : పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలకు చెందిన గుడిపూడి ఛాయాకిరణ్ రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో అన్నవరం జిల్లాలో రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. జిల్లా తరుపున పాల్గొని ద్వితీయస్థానం సాధించారు. ఈ నెల 24 నుంచి 28 వరకు హర్యానా రాష్ట్రం గోహితక్లో జరుగు సబ్ జూనియర్స్ జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం తరుపున పాల్గోనున్నారు.

నేడు వైద్యశిబిరం

పాతపట్నం : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలోని ఆస్పత్రిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బిజెపి నాయకులు సిరిపురం తేజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 60 ఏళ్ల పైబడిన వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. శిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత బాధ్యత

సంతబొమ్మాళి : పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని తెలుగు యువత అధ్యక్షులు కూచెట్టి భానుప్రకాష్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన కెజిబివి విద్యార్థులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ఇల్లును శుభ్రపరిచుకునే విధంగా మన గ్రామాన్నీ శుభ్రపర్చుకోవాలని, తద్వారా స్వచ్ఛ భారత్‌లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం వాలంటీరు కొయ్యాన మధు, రేవతి, దూబ భాస్కర్, కల్లూరి శాంతారావు, కొన్న హరికృష్ణ, రాము, మన్మథ, మోహన్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి- నందిగాం

క్రీడలతో మానసికోల్లాసాన్నిస్తాయని డిప్యూటీ డిఇఒ పి.విలియం అన్నారు. మండలంలోని దేవలభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి బాలుర గ్రిక్స్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో కబడ్డీ ప్రథమ స్థానం కవిటిఅగ్రహారం పాఠశాల, ద్వితీయ స్థానం పెద్దబానాపురం పాఠశాల, ఖోఖో పోటీలో కవిటి అగ్రహారం ప్రథమ స్థానం, నందిగాం పాఠశాలలు ద్వితీయ స్థానాన్ని గెలుపొందారు. వాలీబాల్ పోటీలో ప్రథమ స్థానం జయపురం ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానం కనితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, టెన్నికాయిట్‌లో నందిగాం ప్రథమ స్థానం, లఖిదాసుపురం ద్వితీయ స్థానం, బ్యాడ్మింటన్ పోటీలో నౌకం పాఠశాల ప్రథమ స్థానం, లకిదాసుపుర ద్వితీయ స్థానాలు విజయం సాధించాయి. జూనియర్ విభాగంలో దేవలభద్ర, దిమ్మిడిజోల ప్రథమ, ద్వితీయ స్థానాలు, ఖోఖో పోటీలో కవిటి అగ్రహారం ప్రథమ స్థానం, కనితివూరు ద్వితీయ స్థానాలు గెలుపొందాయి. వాలీబాల్‌లో డిమ్మిడిజోల, దేవలభద్రల ప్రథమ, ద్వితీయ స్థానాలు గెలుపొందాయి. టెన్నికాయిట్‌లో నందిగాం, లఖిదాసపురంలో ప్రథమ, ద్వితీయ విజయం సాధించాయి. బ్యాడ్మింటన్ పోటీలో లఖీదాసపురం, దేవలభద్ర ప్రథమ, ద్వితీయ స్థానాలు గెలుపొందాయి. విజేతలకు విలియం బహుమతులను అందజేశారు. ఈ పోటీలకు రిఫరల్‌గా శ్రీనివాసరావు, జగమ రమేష్, నారాయణరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అనిల్ కుమార్, ఆదినారాయణ, లక్ష్మీపతి వ్యవహరించారు.

45 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని మొండి రాఘవలస పంచాయతీ సుబ్బమ్మపేటలో నందిగామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.అనితకుమారి ఆధ్వర్యాన ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 45 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, అందులో ఐదుగురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. గ్రామంలో తాగునీటి పరీక్షించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ నాగమణి, ఎఎన్ఎం కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ పోలయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'మిత్ర' అకాడమీ సాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇటీవల వరదల వలన తీవ్రంగా నష్టపోయిన విజయవాడ ప్రాంత వాసులకు అండగా నిలిచేందుకు నగరంలోని మిత్ర అకాడమీ ఎమ్‌డి మజ్జి అప్పల సూర్యనారాయణ అకాడమీ ఆధ్వర్యాన ఆదివారం రెండు వందల కుటుంబాలకు సరిపడా నిత్యావసర వస్తువులు, చీరలు, దుప్పటి, పంచె, తువ్వాళ్లు వంటి కొత్త దుస్తులను ప్రత్యేక వాహనంలో విజయవాడకు పంపించారు. ఈ వాహనానికి రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని పిఎస్ఎన్ఎం స్కూల్ నుంచి బయలు దేరిన ఈ వాహనాన్ని నేరుగా విజయవాడ పంపించారు. కార్యక్రమంలో దన్నాన మధన్ మోహన్, స్టార్ వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ ఎస్.జోగినాయుడు, రౌతు సుమతీ మోహన్, శంకరరావు, శ్రీ మిత్రా అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాగులను తనిఖీ చేస్తున్న పోలీసు జాగిలం

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో గంజాయిపై పోలీస్ జాగిలంతో ఎస్ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో సిబ్బంది విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఆర్‌టిసి, ప్రైవేట్ బస్సుల్లో ప్రయాణికుల బ్యాగులను పోలీసు జాగిలంతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ ఆవరణలో దుకాణాలు, ప్లాట్‌ఫారంపై ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేశారు. అలాగే బ్రహ్మపుర నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి పోలీసు జాగిలం, సిబ్బందితో కలిసి పొందూరు రైల్వేస్టేషన్ వరకు వెళ్లి రైలులో ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంజాయి నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి సరఫరాదారుల, విక్రయదారుల సమాచారం తెలిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. గంజాయి నిల్వ ఉంచిన, విక్రయించిన, వినియోగించిన వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

నైపుణ్య శిక్షణతో ప్రతిభకు మెరుగు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని, ప్రతిభను వెలికి తీసే ఉద్దేశ్యంతో ఇంపాక్ట్ సంస్థ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం నగరంలోని 80 అడుగుల రోడ్డులో వి-1 రెస్టారెంట్‌లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజియన్-4 ఐసిఐ క్లబ్స్ ఇనస్టాలేషన్ సెర్మనీ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన నైపుణ్య దానం చేసే ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా చేపట్టడం ఎంతో ప్రయోజనకరమన్నారు. సంస్థ జాతీయ అధ్యక్షులు సోనూ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంపాక్ట్ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభమై విదేశాల్లోనూ తన కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ఇప్పటి వరకు సంస్థ ద్వారా సుమారు 7 వేల మందికి శిక్షణ ఇచ్చామన్నారు. క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు మొబైల్ ఎడిక్షన్, యువతకు బిజినెస్‌లో శిక్షణ, వ్యాపారాభివృద్ధికి సూచనలు, సలహాలు, స్కిల్ దానం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి పల్లంటి చిరంజీవి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఆర్‌వివి ప్రసాద్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, భాస్కరభట్ల శ్రీరాములు, ఆర్. వెంకటేశ్వరరావు, సతీష్ కుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

జికెపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి- లావేరు

ప్రాథమిక స్థాయి నుంచి ప్రతి విద్యార్థి పెద్దబాలశిక్ష చదవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. లావేరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం జనరల్ నాలెడ్జ్‌పై నిర్వహించిన పోటీలో విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం క్లాసు పుస్తకాలకే పరిమితం అవుతున్నారని, జనరల్ నాలెడ్జ్‌పై వెనుకబడి ఉన్నారని, ప్రతిఒక్కరూ పెద్ద బాలశిక్ష చదవాలన్నారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన జనరల్ నాలెడ్జ్ ఈ పుస్తకంలో ఉంటుందని తెలిపారు. ఈ పుస్తకాన్ని విద్యార్థులతో చదివించారు. కార్యక్రమంలో సహాయకులు టి. వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పక్కాగా రికార్డుల నిర్వహణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా స్వయంశక్తి సంఘాలు పంచ సూత్రాలు అమల్లో భాగంగా రికార్డుల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని ఎపిఎం పైడి కూర్మారావు సూచించారు. ఆదివారం మండలంలోని కొర్లకోట, నిమ్మతొర్లాడలో మహిళా సంఘాల పనితీరు, బుక్ కీపింగ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. తీసుకొన్న పొదుపు రుణాలను సక్రమంగా చెల్లిస్తున్నది, లేనిది పుస్తకాలను పరిశీలించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించి ప్రతి ఏడాది తప్పని సరిగా ఆడిట్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ మామిడి చందరరావుతో పాటు విఒఎ వనజాక్షి, శారద తదితరులున్నారు.